క్లుప్తంగా

విద్యార్థులకు పరీక్ష సామగ్రి పంపిణీ



మధురానగర్(విజయవాడసెంట్రల్):విద్యార్థులు ప్రణాళికాబద్ధంగా చదివి విజయం సాధించాలని వాసవీక్లబ్ లక్ష్మీ సత్యనారాయణ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ఎం.గోపాలకృష్ణ సూచించారు. మాచవరం వాణీ స్కూల్‌లో గురువారం వాసవీక్లబ్ లక్ష్మీసత్యనారాయణ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యాన విద్యార్థులకు పరీక్ష సామగ్రి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు లక్ష్యాలు ఏర్పాటు చేసుకుని లక్ష్య సాధనకు కృషి చేయాలని సూచించారు. స్కూలు డైరెక్టర్ అంజూరు శేషుబాబు మాట్లాడుతూ విద్యార్థులు ఒత్తిడి లేకుండా పరీక్ష రాసి మంచి మార్కులు సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో వాసవీక్లబ్ అధ్యక్షుడు ఎస్ వీ సుబ్బారావు, కార్యదర్శి గోపాలకృష్ణ, బి.నారాయణ, కె.శివరామకృష్ణ, ప్రధానోపాధ్యాయురాలు ఝాన్సీలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

చిరు వ్యాపారులకు బండ్లు పంపిణీ



మధురానగర్(విజయవాడసెంట్రల్):తాము చేసిన మంచిని చూసి నచ్చితేనే ఓటు వేయమని అడిగిన ఏకైక సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని 31వ డివిజన్ కార్పొరేటర్ పెనుమత్స శిరీష అన్నారు. 10 మంది చిరువ్యాపారులకు టిఫిన్ బండి పంపిణీ గురువారం చేపట్టారు. కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని టిఫిన్ బండ్లు అందజేశారు. వైఎస్సార్ సీపీ డివిజన్ అధ్యక్షులు పెనుమత్స సత్యం, పెనుమత్స పట్టాభిరామ రాజు, అంగిరేకుల విజయ్, కామరాజు, బాబీ, బాచీ తదితరులు పాల్గొన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్షతో అందరికీ ఆరోగ్యం



మధురానగర్(విజయవాడసెంట్రల్): అందరికీ ఆరోగ్యం అందించాలనే మహోన్నత ఆశయంతో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న ఆరోగ్య సురక్ష పథకం తీసుకొచ్చారని 27వ డివిజన్ కార్పొరేటర్ కొండాయగుంట మల్లీశ్వరి అన్నారు. 198 వ సచివాలయం లో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం గురువారం నిర్వహించారు. కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. ఆరోగ్య పరీక్షల అనంతరం ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో డాక్టర్ సృజన వైఎస్సార్ సీపీ నాయకులు రాము ఆరోగ్యకేంద్రం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రెహ్మాన్‌కు నివాళి




అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకులు షేక్ అబ్దుల్ రెహ్మాన్ (65)(వైట్ అండ్ వైట్) బాబాయ్ అలియాస్ సూర్యుడు గురువారం మృతి చెందారు. గత కొంతకాలం నుంచి అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన సింగ్‌నగర్‌లోని తన నివాసంలో తుది శ్వాస విడిచారు. మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి అభిమానిగా పేరుగాంచిన రెహ్మాన్ వైఎస్సార్ సీపీ ఆవిర్భావం నుంచి పార్టీలో చురుగ్గా సేవలందించారు. ఎమ్మెల్సీ ఎండీ కరీమున్నీసా వెంటే నడుస్తూ సింగ్‌నగర్‌లో పార్టీ అభివృద్ధి కోసం తనదైన సేవలు అందించారు. ఆయన మరణవార్తను తెలుసుకున్న ఎమ్మెల్సీ ఎండీ రుహుల్లా, కార్పొరేటర్ ఎండీ షాహీనాసుల్తానా, కోఆప్షన్ సభ్యులు సయ్యద్ అలీమ్, వైఎస్సార్ సీపీ నాయకులు అధిక సంఖ్యలో హాజరై ఆయన మృతికి నివాళులు అర్పించారు.

దుర్గగుడికి కానుకగా వాటర్ కూలర్

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): వేసవిలో దుర్గమ్మ దర్శనానికి విచ్చేసే భక్తులు చల్లటి మంచినీటిని అందించేందుకు అవసరమైన కూలర్‌ను పాలక మండలి సభ్యులు కట్టా సత్తెయ్య గురువారం దేవస్థానానికి అందచేశారు. సుమారు రూ. 10 వేల విలువైన వాటర్ కూలర్‌ను దేవస్థాన వైదిక కమిటీ సభ్యులు శంకరశాండిల్య చేతుల మీదగా ఆలయ అధికారులకు అందచేశారు. అమ్మవారి ఆలయ ప్రాంగణంలో వాటర్‌కూలర్‌ను అందుబాటులో ఉంచాలని కట్టా సత్తెయ్య ఆలయ అధికారులను కోరారు.

జగనన్న హయాంలోనే కాపుల అభ్యున్నతి

ఎమ్మెల్యేలు వెలంపల్లి, విష్ణు



కల్యాణ మండపాన్ని, ప్రారంభిస్తున్న ఎమ్మెల్యేలు మల్లాది విష్ణు, వెలంపల్లి, కాపు కార్పొరేషన్ చైర్మన్ అడపా శేషు తదితరులు

పాయకాపురం(విజయవాడరూరల్): సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలోనే కాపుల అభ్యున్నతి సాధ్యమైందని మాజీ మంత్రి, సెంట్రల్ నియోజకవర్గ సమన్వయకర్త వెలంపల్లి శ్రీనివాసరావు అన్నారు. 62వ డివిజన్లో కోటి 25 లక్షల రూపాయల వ్యయంతో నిర్మించిన వంగవీటి మోహనరంగారావు కాపు కల్యాణ మండపాన్ని ఏపీ ప్లానింగ్ బోర్డు ఉపాధ్యక్షులు, ఎమ్మెల్యే మల్లాది విష్ణు, మాజీ మంత్రి వెలంపల్లి శ్రీనివాసరావు, కాపు కార్పొరేషన్ చైర్మన్ అడపా శేషు, నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి, డెప్యూటీ మేయర్ అవుతు శైలజ, కార్పొరేటర్ అలంపూరు విజయలక్ష్మి గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ కాపుల చిరకాల వాంఛ కల్యాణ మండపం నిర్మాణాన్ని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వంలో జగనన్న నెరవేర్చారని తెలిపారు. కాపు కల్యాణ మండపాన్ని నేడు ప్రజలకు అంకితం చేశామని పేర్కొన్నారు. కాపులపై చిత్తశుద్ధి కల్గిన వ్యక్తి జగన్‌మోహన్‌రెడ్డి మాత్రమే అన్నారు. కాపు నేస్తం పేరుతో కాపులకు మేలు చేసింది జగన్ అని చెప్పారు. కాపులను మోసం చేసింది చంద్రబాబు అని ధ్వజమెత్తారు. జనసైనికులను మోసం చేస్తున్న వ్యక్తి పవన్ కల్యాణ్ అని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే మల్లాది విష్ణు మాట్లాడుతూ కాపుల సంక్షేమానికి ఈ ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యం ఇస్తున్నట్లు పేర్కొన్నారు. టీడీపీ హయాంలో కాపు కళ్యాణ మండపాన్ని కేవలం జీవోలకే పరిమితం చేశారని విమర్శించారు. కాపు కార్పొరేషన్ చైర్మన్ అడపా శేషు మాట్లాడుతూ చంద్రబాబు చేతిలో పవన్ కళ్యాణ్ జోకర్ అన్నారు. జనసేన పార్టీని పెట్టించింది చంద్రబాబు నాయుడేనన్నారు. తొలుత వంగవీటి మోహనరంగా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పలువురు వైఎస్సార్ సీపీ కార్పొరేటర్లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. అనంతరం 62,6 3వ డివిజన్లలో పలు అభివృద్ధి పనులను ప్రారంభించారు.

మోడల్ డివిజన్‌గా అభివృద్ధి



కమ్యూనిటీ హాల్ ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యేలు మల్లాది విష్ణు, వెలంపల్లి శ్రీనివాసరావు

మధురానగర్(విజయవాడసెంట్రల్): నియోజకవర్గంలో 32వ డివిజన్‌ను మోడల్ డివిజన్‌గా తీర్చిదిద్దామని, నగర అభివృద్ధే ధ్యేయంగా పాలన సాగిస్తున్నామని ఎమ్మెల్యే మల్లాది విష్ణు, వెలంపల్లి శ్రీనివాసరావు అన్నారు. అయోధ్యనగర్‌లో రూ. 17లక్షలతో నిర్మించిన ఎస్సీ కమ్యూనిటీ హాల్‌ను గురువారం ప్రారంభించారు. ముఖ్య అతిథులుగా పాల్గొని డెప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజ, కోఆప్షన్ సభ్యురాలు గుండే సుభాషిణితో కలిసి హాల్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేలు మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో తీవ్ర నిర్లక్ష్యానికి గురయిన డివిజన్‌ను ప్రాధాన్యత క్రమంలో అభివృద్ధి చేస్తున్నామని చెప్పారు. కొద్దిపాటి వర్షానికే జలమయం అయ్యే లోటస్ ల్యాండ్ మార్క్‌ను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దామన్నారు. గత ప్రభుత్వం కమ్యూనిటీ హాల్ నిర్మాణం కోసం కేవలం కౌన్సిల్‌లో తీర్మానం చేసి వదిలివేశారని తెలిపారు. తాము మాత్రం నిర్మించి ప్రారంభిస్తున్నామన్నారు. తమది చేతల ప్రభుత్వం అని మాట ఇస్తే పూర్తిచేస్తామని అన్నారు. ఇక్కడ డివిజన్ వాసుల చిరకాల కోరిక ఎస్సీ కమ్యూనిటీ హాల్‌ను ఇచ్చిన మాట ప్రకారం పూర్తిచేశామన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ డివిజన్ ఇన్‌చార్జి గుండే సుందర్‌పాల్, నాయకులు ఒగ్గు గవాస్కర్, ఎం ఎస్ ఆర్, రాష్ట్ర మహిళ కార్యదర్శి పేరం త్రివేణి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మౌలిక సదుపాయాల కల్పనకు పెద్దపీట



జీవీఆర్‌నగర్ మెయిన్‌రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న మల్లాది విష్ణు, జానారెడ్డి

మధురానగర్(విజయవాడసెంట్రల్): శివారు ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు పెద్దపీట వేశామని తాము అధికారంలోకి వచ్చిన తరువాత 30వ డివిజన్‌లో రూ.26 కోట్ల వ్యయంతో అభివృద్ధి పనులు చేపట్టినట్లు ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. 30వ డివిజన్ గద్దే వెంకట్రామయ్యనగర్, దావు బుచ్చయ్యకాలనీ, వినాయకనగర్‌లలో పలు అభివృద్ధి పనులకు గురువారం కార్పొరేటర్ బి.జానారెడ్డితో కలిసి ప్రారంభోత్సవం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రూ. 9.89 కోట్ల వ్యయంతో 18.02 కిలోమీటర్‌ల మేర రోడ్డు పనులు పూర్తిచేశామన్నారు. అలాగే రూ. 10.11 కోట్ల వ్యయంతో 9.22 కి.మీ మేర వాటర్ పైపు లైన్‌లు, రూ. 6.09 కోట్ల వ్యయంతో 11.33 కి.మీ యూజీడీ పైపులైన్ పనులు పూర్తిచేశామన్నారు. అభివృద్ధి అంటే ఏమిటో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం చేతలలో చేసి చూపించిందన్నారు. గత ప్రభుత్వం శంకుస్థాపనలతోనే సరిపెట్టారని తాము పనులు పూర్తిచేసి ప్రారంభిస్తున్నామని తెలిపారు. ఎన్నికలలో ఫ్యాను గుర్తుకు ఓట్లు వేసి వైఎస్సార్ సీపీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. వైఎస్సార్ సీపీ నాయకులు అమ్ముల వివేకానంద, మార్తి చంద్రమౌళి, సీహెచ్ సుబ్బారెడ్డి, దుర్గారావు, వెంకట రెడ్డి, వినాయకనగర్ రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు రవి, డీఈ గుర్నాథం తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ



లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే విష్ణు

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): ప్రజలందరూ సంపూర్ణ ఆరోగ్యంగా ఉండాలన్నదే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. నియోజకవర్గంలో 10 మందికి మంజూరైన రూ. 10.94 లక్షల విలువైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను ఆంధ్రప్రభ కాలనీలోని తన కార్యాలయంలో గురువారం ఆయన లబ్ధిదారులకు అందజేశారు. ఎమ్మెల్యే విష్ణు మాట్లాడుతూ రాష్ట్రంలోని ప్రతి పౌరుడు ఆరోగ్యంగా ఉండాలని, వారి ఆరోగ్య అవసరాలు తీర్చడమే లక్ష్యంగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. గతంలో కంటే మిన్నగా 3,257 సేవలను ఆరోగ్యశ్రీ పరిధిలోకి తీసుకురావడంతో పాటు శస్త్ర చికిత్స అనంతరం ఆరోగ్య ఆసరా కింద రోగులకు ఆర్థిక సహకారం కూడా అందిస్తున్నారన్నారు. వైద్యం కోసం ఏ పేదవాడు అప్పులపాలు కాకూడదనే తాపత్రయంతో దేశ చరిత్రలో ఏ రాష్ట్రంలో లేని విధంగా ఉచిత వైద్య పరిమితిని రూ.25 లక్షలకు పెంచుతూ సీఎం జగనన్న చారిత్రాత్మక నిర్ణయం తీసుకున్నారని తెలిపారు. ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న తమకు చేయూతనిచ్చిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి, ఎమ్మెల్యే మల్లాది విష్ణుకి లబ్ధిదారుల కుటుంబసభ్యులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

ట్రిబుల్ ఆర్ సెంటర్ ప్రారంభానికి సిద్ధం చేయండి

మున్సిపల్ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్



అధికారులకు ఆదేశాలు ఇస్తున్న కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

భవానీపురం(విజయవాడపశ్చిమ): విజ్ఞాన కేంద్రంగా తీర్చిదిద్దిన ట్రిబుల్ ఆర్ నాలెడ్జ్ సెంటర్‌ను అతి త్వరలో ప్రారంభోత్సవం చేసేందుకు సిద్ధం చేయాలని మున్సిపల్ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అధికారులను ఆదేశించారు. వ్యర్థ నిర్వహణలో ప్రజలకు అవగాహన కల్పించడమే కాకుండా ప్రజల్లో చైతన్యాన్ని కలిగిస్తూ జ్ఞానాన్ని పెంచేందుకు అజిత్‌సింగ్‌నగర్‌లోని ఎక్సెల్ ట్రాన్స్‌ఫర్ స్టేషన్‌లో గల నిర్మిస్తున్న ట్రిబుల్ ఆర్ సెంటర్‌ను ఆయన గురువారం అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎక్సెల్ ట్రాన్స్‌ఫర్ స్టేషన్‌లో నిర్మిస్తున్న ట్రిబుల్ ఆర్ నాలెడ్జ్ సెంటర్ నిర్మాణ పనులు తుది దశకు చేరుకున్నాయని తెలిపారు. నగరానికి మరింత మెరుగులు దిద్దటమే కాకుండా నగర ప్రజల్లో వ్యర్థ నిర్వహణ గురించి అవగాహన కల్పించే త్రీడీ సూక్ష్మ నమూనాలు, అవి పని చేసే విధానాన్ని ఈ సెంటర్‌లో ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. నగరంలోని వ్యర్థాలను సేకరించి ఇక్కడ డంప్ చేసే ప్రాంతమైనప్పటికీ ఎంతో సుందరంగా, ఆహ్లాదకరమైన వాతావరణాన్ని కల్పించచటంతోపాటు కాలుష్యాన్ని తగ్గించే అందమైన మొక్కలను నాటి ప్రజలను ఆకట్టుకునే విధంగా ట్రిబుల్ ఆర్ సెంటర్‌ను తయారు చేయాలని అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. కార్యక్రమంలో ఆయనతోపాటు అడిషనల్ కమిషనర్ (ప్రాజెక్ట్స్) కె సత్యవతి, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (పార్క్స్) ఎఎస్ఎన్ ప్రసాద్ తదితరులు ఉన్నారు.

వినికిడి యంత్రం అందజేత

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): సహాయం అవసరమైన వారికి చేయడంలోనే నిజమైన ఆనందంగా ఉంటుందని వైఎన్నార్ చారిటీస్ చైర్మన్, వైఎస్సార్ సీపీ 8వ డివిజన్ ఇన్‌చార్జ్ యలమంచిలి జయప్రకాష్ చెప్పారు. గిరిపురంలో నివాసం ఉంటున్న కంభంపాటి కిషోర్ కుమార్తె యశ్విత (15) పదో తరగతి విద్యార్థినికి రూ.18 వేలు విలువ గల వినికిడి యంత్రాన్ని గురువారం అందజేశారు.

బైక్ ఢీకొని మహిళకు తీవ్రగాయాలు

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్):రోడ్డుపై నడుచుకుంటూ పనికి వెళ్తున్న ఓ పారిశుద్ధ్య కార్మికురాలిని గుర్తు తెలియని బైక్ ఢీకొనడంతో తీవ్ర గాయాలైన ఘటన సింగ్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. గవర్నమెంట్ ప్రెస్ సమీపంలోని ముత్యాలంపాడుకు చెందిన శ్రీల నాగదుర్గా కార్పొరేషన్‌లో పారిశుద్ధ్య కార్మికురాలిగా పనిచేస్తుంది. బుధవారం మధ్యాహ్నం ఇంటి నుంచి పనికి వెళ్లేందుకు బుడమేరు మీదుగా నడుచుకుంటూ వెళ్తుండగా వెనుక నుంచి అతివేగంగా వచ్చిన ఓ బైక్ బలంగా ఆమెను ఢీకొట్టింది. దీంతో ఆమె తలకు, ఎడమ చేతికి తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు వెంటనే 108కు ఫోను చేసి ఆమెను చికిత్స నిమిత్తం ప్రభుత్వ హాస్పటల్‌కు తరలించారు. ప్రస్తుతం ఆమె పరిస్థితి ఆందోళనకరంగా ఉందని, ఐసీయూలో చికిత్స అందిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. బాధితురాలి కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బీరువా తాళాలు పగలకొట్టి చోరీ

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్):తాళాలు వేసి ఉన్న ఇంట్లోకి దొంగలు ప్రవేశించి బీరువా తాళాలు పగలకొట్టి చోరీకి పాల్పడిన ఘటన అజిత్‌సింగ్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. చెత్త డంపింగ్ యార్డ్ సమీపంలో నివసిస్తున్న పాల సాక్షి రోజూలానే తన ఇంటికి తాళాలు వేసి తన పనులకు వెళ్లింది. మధ్యాహ్నం ఇంటికి వచ్చి చూడగా ఇంటి వెనుక తలుపు తెరిచి కనిపించింది. దీంతో అనుమానం వచ్చిన ఆమె ఇంట్లోకి వెళ్లి చూడగా బీరువా తలుపులు తీసి అందులోని సామాన్లన్నీ చిందరవందరగా పడేసి కనిపించాయి. బీరువా లాకర్‌లో పెట్టిన రూ.40 వేల నగదు, 8 గ్రాముల బంగారు ఉంగరాలు రెండు మాయమయ్యాయి. తమ ఇంట్లో దొంగలు పడ్డారని భావించిన ఆమె పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పార్టీ పటిష్టానికి కృషి చేయాలి

మధురానగర్(విజయవాడసెంట్రల్): వైఎస్సార్ సీపీ పటిష్టతకు కృషి చేయాలని సెంట్రల్ నియోజకవర్గం సమన్వయకర్త, ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు అన్నారు. స్థానిక 32వ డివిజన్‌కు చెందిన పేరం త్రివేణి రెడ్డి వైఎస్సార్ సీపీ మహిళావిభాగం రాష్ట్ర కార్యదర్శిగా నియమితులయ్యారు. ఈమేరకు గురువారం ఆమె వెలంపల్లి శ్రీనివాసరావును మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. తనపై నమ్మకంతో తనకు అప్పగించిన బాధ్యతలను శక్తివంచన లేకుండా నిర్వర్తిస్తానన్నారు. పనిచేసే ప్రతి ఒక్కరికీ గుర్తింపు ఉంటుందని తెలిపారు.

వినియోగదారుల హక్కులపై అవగాహన



విద్యార్థినులకు క్రీడా పరికరాలు అందిస్తున్న బీఐఎస్ అధికారులు

లబ్బీపేట(విజయవాడతూర్పు): విద్యార్థులు, యువత వినియోగదారుల హక్కులపై అవగాహన పెంచుకోవాలని మినిస్ట్రీ ఆఫ్ కన్స్యూమర్ ఎఫైర్స్‌కు చెందిన బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ విజయవాడ బ్రాంచి అసిస్టెంట్ డైరెక్టర్ దరూర్ అఖిల్ అన్నారు. ప్రపంచ వినయోగదారుల దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం పటమటలోని కోనూరు బసవపున్నయ్య జిల్లా పరిషత్ స్కూల్‌లో విద్యార్థులకు వినియోగదారుల హక్కులపై అవగాహన కల్పించేందుకు మనక్ మహోత్సవం నిర్వహించారు. అందులో భాగంగా సురక్షితమైన నాణ్యమైన వస్తువులను అందించడం, ఎగుమతులు, దిగుమతుల ప్రత్యామ్నాయాలను ప్రోత్సహించడం, హాల్ మార్కింగ్ స్టాండరైజేషన్, సర్టిఫికేషన్ టెస్టింగ్ వంటి వాటిపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా దరూర్ అఖిల్ ప్రమాణాల ప్రాముఖ్యత గురించి యువతకు వివరించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ఆయా అంశాలపై పోటీలు నిర్వహించారు. విజేతలకు అల్ట్రాటెక్ సిమెంట్స్, ఏబీజీ గ్రూప్స్ నుంచి వివిధ క్రీడా వస్తువులు అందచేశారు. ఈ కార్యక్రమంలో సిమెంట్స్ క్వాలిటీ కంట్రోల్ మేనేజర్ జయదీప్, సీతారెడ్డి, రవికుమార్, పి చిట్టిబాబు, జయదీప్, అశ్వంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులపై చైర్మన్ సమీక్ష

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ):దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానంలో అభివృద్ధి పనులపై చైర్మన్ కర్నాటి రాంబాబు ఇంజినీరింగ్ అధికారులతో గురువారం సమీక్షించారు. మహా మండపం 7వ అంతస్తులోని చైర్మన్ చాంబర్‌లో నిర్వహించిన సమావేశంలో మల్లేశ్వర స్వామి వారి ఆలయం తుది పనులు, యాగశాల, పూజా మండపాల పనులతో పాటు లడ్డూ, అన్నదానం, క్యూలైన్ల పనుల గురించి చర్చించారు. పనులను సాధ్యమైనంత త్వరగా ప్రారంభించడంతో పాటు దసరా నాటికి పూర్తి చేసేలా చూడాలని కోరారు. సమావేశంలో ఈఈలు కోటేశ్వరరావు, ఎల్.రమాదేవి, డీఈలు, ఏఈలు పాల్గొన్నారు.

నాడు-నేడుతో మారిన పాఠశాలల రూపురేఖలు

- రాష్ట్ర ప్లానింగ్ బోర్డు ఉపాధ్యక్షులు మల్లాది విష్ణు
- సీవీఆర్ మున్సిపల్ హైస్కూల్‌లో అదనపు తరగతి గదుల ప్రారంభం

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన నాడు-నేడు కార్యక్రమంతో ప్రభుత్వ విద్యాలయాలు రూపురేఖలు పూర్తిగా మారిపోయాయని ప్లానింగ్ బోర్డు ఉపాధ్యక్షులు, సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. గవర్నర్‌పేటలోని సీవీఆర్ మున్సిపల్ స్కూల్లో రూ. 1.50 కోట్లతో నిర్మించిన 10 అదనపు తరగతి గదులను గురువారం పశ్చిమ ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాస్‌తో కలిసి విష్ణు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సారథ్యంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే తొలి ప్రాధాన్యతగా ప్రభుత్వ స్కూళ్లను అభివృద్ధి చేసే బాధ్యత తీసుకుందని తెలిపారు. క్వాలిఫైడ్ టీచర్లు, విశాలమైన తరగతి గదులు, చక్కని మరుగుదొడ్లు, ఫర్నీచర్‌తో ఈ ప్రభుత్వంలో పాఠశాలలన్నీ నూతన సొబగులు దిద్దుకున్నాయని పేర్కొన్నారు. టీడీపీ హయాంలో విద్యాలయాలు శిథిలావస్థలో ఎప్పుడు కూలిపోతాయో తెలియని దయనీయ పరిస్థితుల్లో ఉండేవన్నారు. కానీ నేడు సకల వసతులతో స్కూళ్లు కళకళలాడుతున్నాయన్నారు. సీవీఆర్ హైస్కూల్ ఇందుకు చక్కని ఉదాహరణగా పేర్కొన్నారు. ఈ పాఠశాలకు ఎంతో ఘన చరిత్ర ఉందని.. ఇక్కడ విద్యనభ్యసించిన ఎందరో దేశ విదేశాల్లో స్థిరపడ్డారన్నారు. ఇటీవల పూర్వ విద్యార్థులందరూ కలిసి స్కూల్ ఆవరణలో ఒక కళావేదికను నిర్మించడం హర్షణీయమని తెలిపారు. అలాగే మండలానికో మహిళా జూనియర్ కళాశాల ఉండాలన్న ఉద్దేశంతో హైస్కూల్ ఆవరణలో ఒక జూనియర్ కళాశాలను కూడా గతేడాది ప్రారంభించుకున్నట్లు గుర్తుచేశారు. అనంతరం వెలంపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ.. చదువుతోనే పేదరికాన్ని నిర్మూలించగలమని బలంగా నమ్మే వ్యక్తి సీఎం వైఎస్ జగన్ అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఈఈ శ్రీనివాస్, డీఈ గురునాథం, ఏఈ వెంకటేష్, హైస్కూల్ ప్రిన్సిపల్ సి.హెచ్.వి సుబ్రహ్మణ్యం, స్థానిక కార్పొరేటర్ బాల స్వామి, నాయకులు ఆత్మకూరు సుబ్బారావు, ఒగ్గు విక్కీ, చల్లా సుధాకర్, వెన్నం రత్నారావు, సచివాలయ సిబ్బంది, పార్టీ శ్రేణులు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో ఆలయాలకు పూర్వవైభవం

ఎమ్మెల్యేలు మల్లాది, వెలంపల్లి



కన్యకా పరమేశ్వరి కల్యాణ మండపాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యేలు విష్ణు, వెలంపల్లి

సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్): సత్యనారాయణపురంలోని కన్యకా పరమేశ్వరి అమ్మవారి దేవాలయ ప్రాగణంలో నూతనంగా నిర్మాణం పూర్తిచేసుకున్న కన్యకా పరమేశ్వరి కల్యాణ మండపాన్ని సెంట్రల్, పశ్చిమ ఎమ్మెల్యేలు మల్లాది విష్ణు, వెలంపల్లి శ్రీనివాసరావు గురువారం ప్రారంభించారు. ముందుగా వారు ఆలయంలోని కన్యకా పరమేశ్వరి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో దేవాలయాల అభివృద్ధికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విశేషంగా కృషిచేస్తున్నారని చెప్పారు. ఆధ్యాత్మిక ప్రాంతంగా విరాజిల్లుతున్న సత్యనారాయణపురంలో గత పాలకుల నిర్లక్ష్యంతో దేవాలయాలు అభివృద్ధికి దూరంగా ఉన్నాయన్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత దేవదాయ, ధర్మాదాయశాఖ ఆధ్వర్యంలో పురాతన, శిథిలావస్థకు చేరుకున్న అనేక దేవాలయాలకు పూర్వవైభవం తీసుకువచ్చినట్లు తెలిపారు. ఇటీవలే సత్యనారాయణపురంలోని శ్రీ కాశీ విశ్వేశ్వరస్వామి దేవస్థానం, గవర్నరుపేటలోని శ్రీ కాశీ అన్నపూర్ణ దేవస్థానం ఆధునికీకరించినట్లు తెలిపారు. హిందూ ధర్మాన్ని కాపాడుతూ దేవాలయాల వ్యవస్థను ఎల్లవేళలా పరిరక్షిస్తూ ముందుకు సాగుతున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ముక్కంటి దేవతల ఆశీస్సులు మెండుగా ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో స్థానిక 33వ డివిజన్ కార్పొరేటర్ శర్వాణిమూర్తి, కన్యకా పరమేశ్వరి దేవస్థానం అధ్యక్ష, కార్యదర్శులు మైలవరపు రామకృష్ణ, కొల్లూరు రామకృష్ణ, వర్కింగ్ ప్రెసిడెంట్ బొడ్డు శ్రీనివాసరావు, కోశాధికారి దేవకి శివసురేంద్రబాబు, వైఎస్సార్ సీపీ నాయకులు దోనేపూడి శ్రీనివాసరావు, చల్లా సుధాకర్, శనగవరపు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఏపీఎస్పీఎఫ్ సిబ్బందికి కంటి వైద్య పరీక్షలు



కంటి వైద్య పరీక్షలు చేయించుకుంటున్న కమాండెంట్ శంకరరావు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్):ఆంధ్రప్రదేశ్ స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్ (ఏపీ ఎస్పీఎఫ్) విజయవాడ యూనిట్ అధికారులు, సిబ్బందికి ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. విజయవాడ ముత్యాలంపాడు గవర్నమెంట్ ప్రింటింగ్ ప్రెస్ వద్ద కార్యాలయంలో ఏపీఎస్పీఎఫ్ డీజీ డాక్టర్ త్రివిక్రమ వర్మ, ఐజీ రామిరెడ్డి ఆదేశాల మేరకు గురువారం ఈ వైద్య శిబిరం నిర్వహించారు. అగర్వాల్ ఐ హాస్పిటల్ వైద్యులు పాల్గొని 245 మంది సిబ్బందికి కంటి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఎస్పీఎఫ్ కమాండెంట్ ఎం.శంకర్‌రావు మాట్లాడుతూ సిబ్బందికి కంటి సమస్యలు ఉంటే తెలుసుకుని వైద్య పరీక్షలు చేయించాలనే ఉద్దేశంతో శిబిరం ఏర్పాటు చేశామని చెప్పారు. విజయవాడ యూనిట్ అసిస్టెంట్ కమాండ్ పీవీఎస్ఎన్ మల్లికార్జునరావు మాట్లాడుతూ అధికారులు, సిబ్బందికి పూర్తి స్థాయిలో వైద్య పరీక్షలు చేశామని తెలిపారు. అలాగే పరీక్షలు నిర్వహించిన డాక్టర్ అగర్వాల్ ఆసుపత్రి సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇన్‌స్పెక్టర్ కామేశ్వరరావు, ఎస్ఐ ఫణి కుమార్, ఏఎస్ఐ భాను ప్రకాష్ రెడ్డి ఆసుపత్రిసిబ్బంది పాల్గొన్నారు.

సాయుధ పోలీసుల కవాతు



పోలీసు కవాతు నిర్వహిస్తున్న పోలీసులు

పాయకాపురం(విజయవాడరూరల్): ప్రజలు తమ ఓటుహక్కును నిర్భయంగా వినియోగించుకోవాలని, పోలీసులు తోడుంటారని భరోసా కల్పిస్తూ కవాతు నిర్వహించారు. ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనర్ టీకే రాణా ఆదేశాల మేరకు డీసీపీ హరికృష్ణ ఆధ్వర్యంలో గురువారం నున్న పోలీసులు ప్రజలకు అవగాహన కల్పిస్తూ కేంద్ర పారా మిలటరీ సాయుధ దళాలతో ప్రదర్శన నిర్వహించారు. నున్న పోలీసు స్టేషన్ పరిధి లో కండ్రిక, రాజీవ్‌నగర్, ఎల్‌బీఎస్ నగర్ ప్రాంతాల్లో పోలీసు కవాతు కొనసాగింది. రాబోయే ఎన్నికల్లో శాంతిభద్రతలకు ఎటువంటి విఘాతం కల్గకుండా సామాన్యుడు ఓటు హక్కును నిర్భయంగా వినియోగించుకునేలా పోలీసులు చేపడుతున్న వివిధ రకాల ప్రణాళికలో భాగంగానే ఈ కేంద్ర సాయుధ బలగాల కవాతు నిర్వహించామని సీఐ ఎస్.దుర్గాప్రసాద్ తెలిపారు.